సాక్షి
కాకినాడ
శుక్రవారం । 23 । ఆగస్టు । 2024



పేదింట పేలుడు

ప్రయోజకులయ్యారనుకున్న క్షణాలు ఇంతలోనే ఆవిరవుతాయని అనుకోలేదని అచ్యుతాపురం పేలుడు ఘటనలో బాధితుల బంధువులు రోదిస్తున్నారు.


8లో



విజ్ఞాన సారాంశం చాటేలా..

విజ్ఞాన సారాంశాన్ని చాటేలా మండపేటలో అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల మేధోమథనం సాగింది. ఈ కార్యక్రమంలో పలు పరిశోధన పత్రాలను ఎంపిక చేశారు.

2.71 లక్షల క్యూసెక్కుల జలాలు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజ్ నుంచి గురువారం సాయంత్రం 2,71,525 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. కాటన్ బ్యారేజ్ వద్ద 10.6 అడుగులకు నీటి మట్టం చేరింది. ఖరీఫ్ సాగుకు సంబంధించి డెల్టా కాలువలకు 13 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు.

భద్రత లేకుండా వైద్యమెలా..!

- మహిళా వైద్యుల రక్షణపై సర్వత్రా చర్చ
- ఆస్పత్రుల్లో భద్రతపై ఆందోళన
- కోల్‌కతా ఘటన నేపథ్యంలో జీతిల్లుతున్న వైద్య వర్గాలు

సాక్షి ప్రతినిధి, కాకినాడ: వైద్యో నారాయణ హరి.. వైద్యుడు భగవంతుడితో సమానం అంటుంటారు. ప్రాణాలను పణంగా పెట్టి వైద్యం చేస్తూ ఎందరో ప్రాణాలను కాపాడుతుంటాం. వృత్తినే దైవంగా భావిస్తూఅంతే చిత్తశుద్ధితో రోగులకు నయం చేసేంత వరకు శక్తివంచన లేకుండా పనిచేయాలనేదే మా తపన. ఇందు కోసం నిరంతరం పరితపిస్తూనే ఉంటాం. నూటికో కోటికో కొందరు పెడదోవ పట్టే వారు ఉండవచ్చు కానీ.. 90 శాతం మంది మాత్రం రోగిని రక్షించడానికి రాత్రి, పగలు, తిండి, తిప్పలు లేకుండా నిద్రలేని రాత్రులు గడుపుతుంటాం. కండిషన్ సీరియస్ ఒకసారి రండి సర్ అనే పిలుపు రావడం ఆలస్యం.. స్టెత్, కోటు ధరించి ఉన్న పళంగా వెళ్లి సదరు వ్యక్తిని ప్రాణాపాయం నుంచి రక్షించే మా సేవలను కోవిడ్ కాలంలో ఎంతో మంది ప్రత్యక్షంగా చూశారు. మా సేవలను వేనోళ్ల పొగిడారు. ప్రాణాలు పోయడమే తెలిసిన తమపై కొన్ని చోట్ల అకృత్యాలు.. అరాచకాలు.. దాడులు చేస్తు మా మనో స్థైర్యాన్ని దెబ్బతీస్తున్నారు. ఇలాంటివి తరచూ జరుగుతుంటే ఏ ధైర్యంతో మరో కేసును ధైర్యంగా ఎదుర్కొనగలమని వైద్యులు ప్రశ్నిస్తున్నారు. కోలకతాలోని ఆర్‌జీ కర్ ఆస్పత్రిలో ఇటీవల జరిగిన యువ వైద్యురాలి హత్యాచార ఉదంతం తమను ఎంతో బాధించిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అన్ని స్థాయిల్లో పటిష్టమైన భద్రత, నిరంతర నిఘా, ఆస్పత్రికి రోగులతో పాటు వచ్చే సహాయకుల నియంత్రణ, మద్యం తాగి వచ్చేవారిని ఆస్పత్రి గేటు దాటకుండా కట్టడి చేయడం, అనుమానం వస్తే బ్రీత్ అనలైజర్‌లతో తనిఖీలు చేయడం వంటి చర్యలు తీసుకోవాలని వారు సూచిస్తున్నారు. వారి భయాందోళనలు 'సాక్షి'తో ఇలా పంచుకున్నారు.

కోల్‌కతాలో జరిగిన ఘటనల్లాంటివి పునరావృతం కాకుండా ఉండాలంటే సమాజం నుంచే మార్పు మొదలవ్వాలని మహిళా వైద్యులు అంటున్నారు. ఆత్మ విశ్వాసంతో వృత్తి ధర్మాన్ని నిర్వర్తించే వాతావరణం ప్రైవేటు లేదా, ప్రభుత్వ ఆస్పత్రుల్లో కచ్చితంగా ఉండాల్సిందేనని అధికారులను డిమాండ్ చేస్తున్నారు. దైవంగా కొలిచే ఆస్పత్రుల్లో వైద్యులకే రక్షణ లేకుంటే ప్రాణాపాయంలో వచ్చే రోగులకు వైద్యం ఎలా చేయగలుగుతామని వారు ప్రశ్నిస్తున్నారు. కోలకతా దారుణ హత్యాచార ఉదంతాన్ని అన్ని వర్గాలు తీవ్రంగా పరిగణిస్తున్నాయి. ఇటువంటి దుర్మార్గాలను ఒడిగట్టే వారికి ఉరే సరైన శిక్ష అని వైద్యేతర వర్గాల వారు డిమాండ్ చేస్తున్నారు.



జూనియర్ డాక్టర్‌పై అత్యాచారం, హత్యను నిరసిస్తూ ఆందోళన చేస్తున్న వైద్యులు

ఆస్పత్రులను సేఫ్ జోన్లుగా ప్రకటించాలి



ఆస్పత్రులను సున్నితమైన ప్రాంతాలుగా గుర్తించి ఆ పరిధి మొత్తాన్ని సేఫ్ జోన్లుగా ప్రకటించాలి. ప్రోటోకాల్ ప్రకారం ఇలా చేస్తే రోగులకు సేవలందించే వైద్యులతో పాటు వైద్యేతర సిబ్బంది, రోగుల భద్రతకు ఇబ్బంది ఉండదు. డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో తీసుకువచ్చిన 11/2008 చట్టం వైద్యులకు రక్షణ కవచం. వైద్యులపై జరిగే దాడులపై నాన్ బెయిలబుల్ కేసులు నమోదైతే ఒక భయం ఉంటుంది. ప్రజల ఆరోగ్యం కోసం ప్రాణాలకు తెగించి సేవలందించే వైద్యుల రక్షణ కోసం సెంట్రల్ ప్రొటెక్షన్ యాక్ట్ చట్టాన్ని తక్షణమే రూపొందించాలి. 2019లో కేంద్రం పార్లమెంటులో ఈ విషయంపై చర్చించినా చట్టం రూపకల్పనకు మాత్రం నోచుకోలేదు. అత్యవసర విభాగం, ప్రసూతి, చంటిపిల్లల వైద్య విభాగాలు, వార్డుల్లో ప్రతి చోట సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ పద్మదీపిక, పీజీ, ఆర్‌ఎంసీ, కాకినాడ

మొబైల్ యాప్‌లు వినియోగించాలి



పనిచేసే ప్రాంతంలో మహిళా వైద్యులకు రక్షణ అనేది ప్రభుత్వం బాధ్యతగా తీసుకోవాలి. 24/7 నిఘా, శిక్షణ పొందిన సిబ్బందితో మెరుగైన భద్రత కల్పించాలి. లైంగిక హింసకు వ్యతిరేకంగా జీరో–టాలరెన్స్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలి. దీనికి స్పష్టమైన రిపోర్టింగ్ విధానాలు, బాధితులకు చట్టపరమైన మద్దతు ఉండాలి. ఆసుపత్రుల్లో క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, ఆత్మరక్షణ కోసం శిక్షణ ఇవ్వాలి. భద్రతను పెంచడానికి పానిక్ బటన్ (అలారమ్ సిస్టమ్స్)లు, మొబైల్ యాప్‌ల వంటి సాంకేతికతను ఉపయోగించుకోవాలి. డ్రెస్ చేంజెస్ కోసం ప్రత్యేక భద్రతతో రూమ్‌లు ఏర్పాటుచేయాలి.

– డాక్టర్ సత్య కళ్యాణి అల్లుమల్లు, అనస్థీషియాలజిస్ట్, ఇంటెన్సివిస్ట్, ట్రస్ట్ హాస్పిటల్, కాకినాడ

సీసీ కెమెరాలతో నిఘా ఉంచాలి



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల దగ్గర నుంచి జిల్లా కేంద్రంలో ఉన్న ఆస్పత్రుల్లో సైతం సీసీ కెమెరాలతో నిరంతరం నిఘా అవసరం. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో నర్సులు, నర్సింగ్ సిబ్బందితో పాటు మహిళా వైద్యులకు పటిష్టమైన భద్రత కల్పించాలి. ఇందుకోసం ప్రత్యేకంగా ఒక భద్రతా వ్యవస్థను రూపొందించాలి. పెద్దాస్పత్రి అయినా ప్రైవేటు ఆస్పత్రి అయినా, కార్పొరేట్ ఆస్పత్రిలో అయినా రోగులతో పాటు వచ్చే సహాయకుల సంఖ్యను ఒకరిద్దరికే పరిమితం చేయాలి.

– మామిడి చిన్నారి, నర్సింగ్ ఆఫీసర్, నర్సెస్ స్ట్రగుల్ కమిటీ, రాష్ట్ర సమన్వయ కర్త

ప్రజలలో అవగాహన పెంచాలి



కోలకతా వంటి సంఘటనలు పునరావృతం కాకుండా మొదట ప్రజల్లో అవగాహన పెంపొందించాలి. అక్కడి ప్రభుత్వాలు, కేంద్రం ఇప్పటికీ వైద్యురాలిపై జరిగిన అఘాయిత్యంపై స్పష్టత ఇవ్వకపోవడం అన్యాయం. దేశం మొత్తాన్ని తొలుస్తున్న ప్రశ్న ఒకటే. దారుణం వెనుక దాగున్నదెవరనే...? రాత్రి పూట విధుల్లో ఉండే మహిళా వైద్యుల భద్రతకు పటిష్టమైన రక్షణ చర్యలు తీసుకోవాలి. ఇటువంటి సంఘటనలతో రోజురోజుకు మహిళా వైద్యులు, మహిళా వైద్య సిబ్బంది ఆత్మవిశ్వాసంతో పనిచేయలేని పరిస్థితి ఎదురవుతుంది. ఇటువంటి సంఘటనలకు ఎక్కడో ఒక చోట కట్టడి చేయకుంటే సమాజానికి మంచిది కాదు. ఆస్పత్రికి రోగులతో పాటు వచ్చే సహాయకుల సంఖ్యను నియంత్రించాలి. రాత్రి పూట వైద్యులు పనిచేసే ప్రాంతంలో మహిళా భద్రతా సిబ్బందిని షిఫ్టుల వారీగా నియమించాలి.

– ఎ.శ్రీప్రదీప్తి, అసిస్టెంట్ ప్రొఫెసర్, గైనకాలజీ, ఆర్‌ఎంసీ, కాకినాడ

మహిళా డాక్టర్లకు ప్రత్యేక రక్షణ ఉండాలి



ఆసుపత్రిలో పనిచేస్తున్న మహిళా డాక్టర్లు, సిబ్బందిపై దాడులు పెరిగిపోయాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ప్రత్యేక రక్షణ చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైద్యులతో పాటు మహిళా సిబ్బంది రాత్రి సమయంలో విధులు నిర్వహించడం అనివార్యం. ఇటువంటి సమయంలో రక్షణ లేకపోతే ఆసుపత్రుల్లో పనిచేయడం ఇబ్బందికరమే. ప్రతి ఆస్పత్రిలో ప్రత్యేకమైన పోలీస్ భద్రత ఏర్పాటు చేయాలి.

– డాక్టర్ కె.లక్ష్మి, పెద్దాపురం

ఆర్‌ఎంసీ, జీజీహెచ్‌లలో భద్రతకు ఢోకాలేదు



కాకినాడ రంగరాయ వైద్య కళాశాల, జీజీహెచ్‌లో అభద్రతకు తావు లేదు. వసతి గృహాల నుంచి తరగతి గదుల వరకు అన్ని చోట్ల నిత్యం భద్రత కొనసాగుతోంది. గతంలో దిశ పోలీసుల ఆధ్వర్యంలో సెన్సిటైజేషన్ ప్రోగ్రాం నిర్వహించి భద్రతా చర్యలపై అవగాహన కల్పించాం. ఎన్‌ఎంసీ నియమాల ప్రకారం లైంగిక నేరాల నియంత్రణలో భాగంగా అంతర్గత ఫిర్యా దుల కమిటీ ఉంది. జీజీహెచ్‌లో రాత్రి వేళ విధులు నిర్వర్తిస్తున్న వైద్యులు, వైద్యేతర సిబ్బంది భద్రత కోసం సెక్యూరిటీని మరింత పెంచారు. భద్రతకు సీసీ కెమేరాల నిఘా నిరంతరం ఉంటోంది. జీజీహెచ్‌లో పోలీస్ అవుట్ పోస్టు 24/7 కొనసాగుతోంది.

– డాక్టర్ దేవీ మాధవి, ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్, కాకినాడ

పెద్దదిక్కుకు భద్రత అంతంతే

కాకినాడ సామాన్య ప్రభుత్వ ఆస్పత్రికి నిత్యం రెండు వేల నుంచి మూడు వేల వరకు ఓపీ (ఔట్ పేషెంట్), 1500 మంది వరకూ ఇన్‌పేషెంట్లు వస్తుంటారు. ఈ ఆస్పత్రిలో 56 విభాగాలు నడుస్తున్నాయి. ప్రస్తుతం ఒక వార్డులో ఒక ప్రైవేటు సెక్యూరిటీ గార్డు మాత్రమే ఉంటున్నారు. దీని వల్ల రాత్రి పూట భయంగా విధులు నిర్వర్తించే వాతావరణం ఉంటుందని జూనియర్ వైద్యులు చెప్తున్నారు. ప్రతి వార్డులో ఒన్ ప్లస్ ఒన్ విధానంలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులను నియమించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. ప్రధానంగా ఒక రోగితో నలుగురైదుగురు సహాయకులు వస్తుండడం వారిని నియంత్రించడం సాధ్యం కావడం లేదంటున్నారు. ఒకేసారి రోగికి సంబంధించిన బంధుమిత్రులంతా కలిసి రావడం, వార్డులోకి రోగితో పాటు పంపకుంటే గొడవకు దిగుతున్న పరిస్థితులు నెలకొంటున్నాయి. జీజీహెచ్‌లో ప్రైవేటు భద్రతా సిబ్బంది 200 పై చిలుకు ఉన్నారని చెబుతున్నారు. ఈ సంఖ్యను రాత్రి సమయాల్లో మరింత పెంచాలని మెడికోలు అభిప్రాయపడుతున్నారు. జీజీహెచ్ ఆవరణలో ఆస్పత్రితో సంబంధం లేని వారు మద్యం తాగి రాత్రి సమయాల్లో వచ్చి గొడవలు పడుతున్నారు. ఇది కొన్ని వార్డుల్లో ఆందోళన కలిగిస్తోందని ఫిర్యాదు చేస్తున్నారు. ప్రధానంగా క్యాజువాలిటీ, మెడిసిన్, ఆర్థోపెడిక్ వంటి విభాగాల్లో భద్రత పెంచాల్సిన అవసరాన్ని వైద్యులు నొక్కి చెబుతున్నారు. 24 గంటలు పనిచేసే పోలీసు ఔట్ పోస్టు ఉన్నా మూడు షిప్టులు కలిపి తొమ్మిది మంది పోలీసులు మాత్రమే పనిచేస్తున్నారు. అంటే షిఫ్ట్‌కు ముగ్గురు వంతున ఉంటున్నారు. రాత్రి పూట 9 షిప్టుల్లో ఇప్పుడు విధులు నిర్వర్తిస్తున్న ముగ్గురితో పాటు మరో ముగ్గురుతో భద్రత పెంచాలని జూనియర్ వైద్యులు సూచిస్తున్నారు. రంగరాయ వైద్య కళాశాలలో ఇప్పుడున్న 25 మంది సెక్యూరిటీ గార్డులను రాత్రి పూట మరో పది మందిని పెంచాలని పీజీలు కోరుతున్నారు.

కాకినాడ ఆర్‌ఎంసీ/జీజీహెచ్ వైద్యుల వివరాలు

అసిస్టెంట్‌లు :	71	ఆశాలు :	1,452
అసోసియేట్లు :	29	యూపీహెచ్‌సీలు :	23
ప్రొఫెసర్లు :	38	సీహెచ్‌సీలు :	9
పీజీలు :	203 మంది	విలేజ్ హెల్త్ క్లీనిక్‌లు :	620
హౌస్ సర్జన్లు :	240	ఏరియా ఆసుపత్రి :	1
పీహెచ్‌సీలు :	44	టీచింగ్ ఆసుపత్రి :	1
జిల్లావ్యాప్తంగా... వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో...			
మెడికల్ ఆఫీసర్లు :	102	ప్రైవేటు ఆసుపత్రులు (క్లినిక్‌లు, నర్సింగ్ హోమ్‌లు, ఆసుపత్రులు, మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్స్) :	655
పారా మెడికల్ సిబ్బంది :	1049		

రత్నగిరిపై పెళ్లి సందడి

- గురువారం రాత్రి భారీగా వివాహాలు
- సత్రాలన్నీ పెళ్లి బృందాలతో కిటకిట

అన్నవరం: రత్నగిరి సత్యదేవుని సన్నిధి గురువారం రాత్రి భారీగా తరలివచ్చిన పెళ్లి బృందాలతో ప్రత్యేక సందడి నెలకొంది. గురువారం రాత్రి 10.30 గంటల ముహూర్తం, తెల్లవారుజాము 3.30 గంటల ముహూర్తాల్లో 150 వివాహాలు జరగనుండడంతో పెళ్లి బృందాలతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసిపోయింది. ప్రధానంగా రామాలయం వద్ద వార్షిక కల్యాణ మండపం ముందు విశ్రాంతి షెడ్డులో ఏకకాలంలో 25 వివాహాలు జరిగాయి. తెల్లవారుజామున కూడా మరో 25 వివాహాలు జరగనున్నాయి. వీటితో పాటు సీతారామ సత్రంలో మరో 40, న్యూ సీసీ, పాత సీసీ సత్రాల్లో కూడా వివాహాలు జరిగాయి. సత్యగిరిపై విష్ణు సదన్ కల్యాణ మండపాల్లో కూడా సుమారు 50 వివాహాలు జరిగాయి. దీంతో సత్రాలన్నీ పెళ్లి బృందాలు నిండిపోయాయి. వీటితో పాటు దాత మంతెన శ్రీనివాస్ నిర్మించిన శ్రీ సత్యశ్రీనివాస ఉచిత



సత్యదేవుని ఆలయ ప్రాంగణంలో సాగుతున్న వివాహాల సందడి

ఏసీ కల్యాణ మండపం, విశాఖపట్నానికి చెందిన పారిశ్రామిక వేత్త ఎంఎస్ రెడ్డి, అంజని ఉచిత వివాహ వేదికలో కూడా ఇదే ముహూర్తాల్లో 48 వివాహాలు జరిగాయి. కాగా గురువారం రాత్రి, తెల్లవారుజామున రత్నగిరిపై 150కి పైగా వివాహాలు జరగడంతో ఆ పెళ్లి బృందాల వారు వివిధ సత్రాల్లో గదులు రిజర్వ్ చేసుకున్నారు. ఈ దృష్ట్యా పెళ్లి బృందాలు శుక్రవారం సత్యదేవుని ఆలయానికి వచ్చి స్వామి వారి వ్రతాలు ఆచరించనున్నారు. దీంతో దేవస్థానంలో శుక్రవారం తీవ్ర రద్దీ ఏర్పడనుండి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి సుమారు రూ.30 లక్షలు ఆదాయం సమకూరింది.

ఉత్సవాలతో కళలకు జీవం

- డీఆర్వో తిప్పేనాయక్
- ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవం
- వివిధ కళారూపాలతో నగరంలో ర్యాలీ

కాకినాడ సిటీ: మరుగున పడుతున్న జానపద కళలను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమని జిల్లా రెవెన్యూ అధికారి డి తిప్పేనాయక్ అన్నారు. గురువారం ప్రపంచ జానపద దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్ నుంచి బాలాజీ చెరువు సెంటర్ వరకు నిర్వహించిన వివిధ రకాల జానపద కళాకారుల ర్యాలీని ఆయన ప్రారంభించారు. ఆధునిక కాలంలో సినిమాలు, సోషల్ మీడియా ఎంత విస్తృతంగా ఉన్నప్పటికీ ఏటా ఇలాంటి ఉత్సవాలు నిర్వహించడం ద్వారా జానపద కళలు సజీవంగా ఉంటాయన్నారు. కళాకారులందరికీ జానపద దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. జిల్లా సమాచారశాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున మాట్లాడుతూ జానపద కళలపై ప్రజల్లో అవగాహన, ఆసక్తి కల్పించే ఉద్దేశంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఇటువంటి కార్యక్రమాలకు అందరూ సహకరించి కళాకారులను ప్రోత్సహించాలని పేర్కొన్నారు. జిల్లాలో ఉన్న కళాకారు



కళాకారుల ర్యాలీని ప్రారంభిస్తున్న డీఆర్వో తిప్పేనాయక్

లందరినీ ఒకే వేదిక పైకి తీసుకువచ్చే ప్రయత్నమే ఈ ర్యాలీ అన్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ జానపద కళారూపాలైన తోలు బొమ్మలాట, తంబుర, వీధి నటకం, జముకల కథ తదితర కళారూపాలతో ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జానపద కళాకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎల్ఎస్ కృష్ణబాబు, కాకినాడ జిల్లా అధ్యక్షులు వీరనాల కృష్ణ, ప్రధాన కార్యదర్శి తోట పవన్‌కుమార్, కోశాధికారి వేర్నాల ప్రకాష్‌రాజు, గౌరవ అధ్యక్షులు పుల్లారావు, ముఖ్య సలహాదారులుగా వెంకటేశ్వరరావు, ఏడుకొండలు, తోట బాల కృష్ణ, పెద్ద ఎత్తున కళాకారులు పాల్గొన్నారు.

ఓటు నమోదు ప్రక్రియ ప్రారంభం

- అక్టోబర్ 18వ తేదీ వరకు నిర్వహణ
- ఇంటింటికీ వెళ్లి పరిశీలించనున్న బీఎల్‌ఓలు

కాకినాడ సిటీ: స్పెషల్ సమ్మరీ రివిజన్ (ఎస్ఎస్ఆర్)–2025లో భాగంగా కొత్త ఓటర్ల నమోదు, పాత ఓటరు జాబితాలోని తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి భారత ఎన్నికల సంఘం అవకాశం కల్పించింది. ఇందు కోసం ఇప్పటికే బీఎల్‌ఓలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఈ ప్రక్రియ అక్టోబర్ 18వ తేదీ వరకు ఓటర్ల నమోదుకు జిల్లా ఎన్నికల సంఘం ఏర్పాట్లు పూర్తి చేసింది. 2024 ప్రత్యేక ఓటరు సవరణ జాబితా ప్రకారం జిల్లాలో మొత్తం 16,34,122 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 8,04,465 మంది పురుష ఓటర్లు కాగా, 8,29,471 మంది మహిళా ఓటర్లు, 186 మంది థర్డ్‌జెండర్ ఓటర్లు ఉన్నారు. జిల్లాలోని పిఠాపురం మినహా మిగిలిన నియోజకవర్గాల్లో మహిళా ఓటర్ల సంఖ్యే ఎక్కువగా ఉంది. ఈ క్రమంలో పాత ఓటర్ల జాబితాపై విచారణతో పాటు కొత్త ఓటర్ల నమోదుకు బీఎల్‌వోలు దరఖాస్తులను స్వీకరిస్తున్నారు. ఈ సందర్భంగా మార్పులు చేర్పులు చేస్తున్నారు. కాగా అక్టోబర్ 29వతేదీన ముసాయిదా ఓటరు జాబితాను ప్రకటిస్తారు. ఆ జాబితాపై నవంబర్ 28వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరణ, డిసెంబర్ 24వ తేదీ లోపు వచ్చిన అభ్యంతరాల పరిశీలన పూర్తి చేసి 2025 జనవరి 5వ తేదీన తుది ఓటరు జాబితాను ప్రకటిస్తారు.

దరఖాస్తులను ఎక్కడ ఇవ్వాలి

కొత్తగా ఓటరు నమోదు కోసం లేదా ఫిర్యాదులపై ఇంటికి వచ్చే బీఎల్‌వోకు దరఖాస్తు ఇవ్వవచ్చు. లేదంటే ప్రతి పోలింగ్ కేంద్రంలో నిర్వహించే ప్రత్యేక క్యాంపెయిన్ రోజుల్లోనూ అభ్యంతరాలు, క్లెయిమ్‌లు, మార్పులు, చేర్పులపై దరఖాస్తులు స్వీకరిస్తారు. ఆయా రోజుల్లో జిల్లాలోని 1640 పోలింగ్ బూతుల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి వినతులను స్వీకరిస్తారు. లేకపోతే స్థానిక తహసీల్దార్ కార్యాలయాల్లోనూ దరఖాస్తులను సమర్పించవచ్చు.

అనుమతించిన మేరకే ఉత్పత్తి చేయాలి

పొగాకు బోర్డు ఆర్‌ఎం ప్రసాద్

దేవరపల్లి: పొగాకు బోర్డు అనుమతించిన మేరకే ఉత్పత్తి జరగాలని బోర్డు రీజనల్ మేనేజరు జీఎల్‌కే ప్రసాద్ రైతులకు సూచించారు. బోర్డు అనుమతి లేకుండా కొత్తగా బ్యారన్ల నిర్మాణం, అధికంగా సాగు చేయడం చట్టరీత్యా నేరమని ఆయన తెలిపారు. దేవరపల్లి వేలం కేంద్రంలో గురువారం సాయంత్రం రాజమహేంద్రవరం పొగాకు ప్రాంతీయ కార్యాలయం పరిధిలోని ఐదు వేలం కేంద్రాల రైతు సంఘాల అధ్యక్షులు, ప్రతినిధులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో 2024–25 పంటసాగుపై చర్చించారు. వచ్చే ఏడాదికి ఎన్ఎల్ఎస్ ప్రాంతంలోని ఐదు వేలం కేంద్రాల్లో బ్యారన్‌కు 41.25 క్వింటాళ్ల ఉత్పత్తికి అనుమతి ఇచ్చినట్టు ఆయన తెలిపారు. ఐదు వేలం కేంద్రాల్లో గత ఏడాది 49.50 మిలియన్ల కిలోల ఉత్పత్తికి అనుమతి ఇవ్వగా, సుమారు 65 మిలియన్ల కిలోలు ఉత్పత్తి అవుతుందని అంచనా వేసినట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు ఎన్ఎల్ఎస్ ప్రాం



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌ఎం ప్రసాద్

తాల్లోని ఐదు వేలం కేంద్రాల్లో 53 మిలియన్ల కిలోల పొగాకు విక్రయాలు జరిగాయని, మరొక 12 మిలియన్ల కిలోలు రైతుల వద్ద విక్రయానికి ఉందన్నారు. బ్రైట్ గ్రేడు 4 మిలియన్లు, మీడియం గ్రేడు 4 మిలియన్లు, లోగ్రేడు 4 మిలియన్లు రైతుల వద్ద ఉన్నట్టు అంచనా వేస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రస్తుతం కిలో.235 పలుకుతున్న లోగ్రేడు పొగాకును విక్రయించడానికి రైతులు సుముఖంగా లేనందున వేలం కేంద్రాలకు వచ్చిన బేళ్లు నోబిడ్ అవుతున్నాయన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పొగాకు వినియోగం పెరగలేదని, గత ఏడాది బ్రెజిల్, జింబాబ్వే, ఆఫ్రికా దేశాల్లో ప్రకృతి సహకరించనందున ఉత్పత్తి తగ్గిందన్నారు. దీంతో మన పొగాకుకు అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ ఏర్పడి ఊహించని ధర లభించిందన్నారు. ఈ ఏడాది అక్కడ పొగాకు ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకుని రైతులు సాగు తగ్గించుకోవాలన్నారు.

సెప్టెంబరు 20 వరకు కొనుగోళ్లు

సెప్టెంబరు 20వ తేదీ వరకు ఎన్ఎల్ఎస్ పొగాకు కొనుగోళ్లు జరుగుతాయని ఆర్‌ఎం ప్రసాద్ తెలిపారు. ఈ నెలాఖరున దేవరపల్లి, గోపాలపురం వేలం కేంద్రాల్లో కొనుగోళ్లు ముగియనున్నట్టు ఆయన తెలిపారు. కొయ్యలగూడెం వేలం కేంద్రంలో సెప్టెంబరు 10న, జంగారెడ్డిగూడెంలోని రెండు వేలం కేంద్రాల్లో 20వ తేదీ నాటికి పొగాకు కొనుగోళ్లు ముగిస్తున్నట్టు ఆయన తెలిపారు. ఇప్పటి వరకు ఐదు వేలం కేంద్రాల్లో వర్జీనియా పొగాకు 53.29 మిలియన్ల కిలోలు విక్రయాలు జరిగాయని, కిలో గరిష్ట ధర రూ. 400, కనిష్ట ధర రూ. 235, సగటు ధర రూ.333.30 లభించినట్టు ఆయన తెలిపారు. సమావేశంలో వేలం నిర్వహణాధికారి హేమస్మిత, పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ గద్దే శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి



ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతున్న మద్యం దుకాణాల సిబ్బంది

కాకినాడ రూరల్: ప్రభుత్వ మద్యం దుకాణాల్లో పనిచేస్తున్న సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ బెవరేజస్ కార్పొరేషన్ కాంట్రాక్టు అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సామర్లకోట డిపో పరిధిలోని మద్యం దుకాణాల్లో పనిచేసే సూపర్‌వైజర్లు, సేల్స్‌మన్ సర్పవరంలో గురువారం సమావేశమయ్యారు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ తీసుకువచ్చేందుకు కసరత్తు చేస్తున్నందున తమ కుటుంబాలకు ఉద్యోగ భరోసా కల్పించాలని అసోసియేషన్ తరఫున సిబ్బంది కోరారు. అసోసియేషన్ అధ్యక్షుడు సబ్బతి చిట్టిబాబు, ఉపాధ్యక్షుడు ఐ.శ్రీను, కార్యదర్శి వీరబాబు తదితరులు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో కరోనా సమయంలోనూ ప్రాణాలు లెక్క చేయకుండా పని చేశామని తెలియజేశారు. సమావేశంలో సంఘ నాయకులు సూర్యచంద్ర, సంతోష్‌కుమార్, దొరబాబు, సద్గురు, గంగారామ్, గోపి, కృష్ణ, ఖాసిం హుస్సేన్, గోపాలకృష్ణ, ఆర్.శ్రీను, ఆర్.అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలతో ఉపశమనం

కాకినాడ సిటీ: జిల్లా వ్యాప్తంగా ఆరు రోజులుగా ఎండతీవ్రత, ఉక్కపోతతో అల్లాడుతున్న ప్రజలకు గురువారం 12.20 నిమిషాలకు కురిసిన కుండపోత వర్షం ఊరటనిచ్చింది. ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు వాతావరణం చల్లబడడంతో ఊపిరి పీల్చుకున్నారు. జిల్లాలో గత వారం రోజులుగా పగటి ఉష్ణోగ్రతలు వేసవిని తలపించేలా 36 నుంచి 38 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో నగరంలో ఏసీల వినియోగం బాగా పెరిగింది. గత నాలుగేళ్లలో ఆగస్టు నెలలో ఇలాంటి పరిస్థితి లేదని, బంగాళాఖాతంలో అల్పపీడన ద్రోణి వల్ల తీవ్ర ఉష్ణోగ్రతలు నెలకొన్నట్టు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.

నిత్యాన్నదానానికి రూ.50 వేల విరాళం



దాత వెంకటేశ్వరరావు దంపతులకు స్వామివారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అర్చకులు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వరస్వామివారి ఆలయంలో నిత్యాన్నదాన పథకానికి పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడేనికి చెందిన కలిశెట్టి వెంకటేశ్వరరావు, రామలక్ష్మి దంపతులు గురువారం రూ.50 వేలు సమర్పించారు. ఈ సొమ్మును ఆలయ అర్చకులకు అందజేశారు. దాతకు అర్చకులు, వేద పండితులు స్వామి చిత్రపటం, ప్రసాదం ఇచ్చారు.

హుండీల ఆదాయం లెక్కింపు

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో హుండీలను గురువారం లెక్కించారు. 38 రోజులకు గాను రూ.70,16,714 ఆదాయం వచ్చిందని దేవదాయ ధర్మదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, ఆలయ ఈఓ భూపతిరాజు కిశోర్‌కుమార్ తెలిపారు. అలాగే విదేశీ కరెన్సీ వచ్చిందన్నారు. 72 గ్రాముల బంగారు, 750 గ్రాముల వెండి వచ్చిందని వివరించారు. భారీ వర్షం కారణంగా ప్రధాన, అన్నదాన హుండీలు, శ్రీఅన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామి హుండీలను లెక్కించలేదు. లెక్కింపు కార్యక్రమం జిల్లా దేవాదాయ, అసిస్టెంట్ కమిషనర్ ఎం.లక్ష్మీనారాయణ, మండపేట గ్రూప్ టెంపుల్స్ ఈఓ పీవీవీఎస్.కామేశ్వరరావు పర్యవేక్షణలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

జాబ్ మేళాలో 36 మంది ప్రతిభ

అమలాపురం రూరల్: ప్రముఖ ప్రైవేట్ కంపెనీల్లో పని చేయడానికి అమలాపురంలోని జిల్లా ఉపాధి కార్యాలయంలో గురువారం జాబ్ మేళా నిర్వహించారు. దీనికి క్యాస్ కార్పొరేషన్, శ్రీరామ్ లైఫ్ ఇన్సూరెన్స్, అమరరాజా గ్రూప్ కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 68 అభ్యర్థులు రాగా 36 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. జిల్లా ఉపాధి అధికారి ఇ.వసంతలక్ష్మి మాట్లాడుతూ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు దూరాభారమైనా చేరి స్కిల్స్ మెరుగు పరుకోవాలన్నారు.

క్లుప్తంగా

ఫిట్స్‌తో చెరువులో పడి వ్యక్తి మృతి


చెరువులో పడి మృతి చెందిన దుర్గాప్రసాద్

మామిడికుదురు: అప్పన పల్లిలో చేపల చెరువుల వద్ద పనిచేస్తున్న బి.దొడ్డవరం గ్రామానికి చెందిన కుంచే దుర్గాప్రసాద్ (32)కు ఫిట్స్ రావడంతో చెరువులో పడి మృతి చెందాడని నగరం ఏఎస్సై కృష్ణ తెలిపారు. మృతుడి అన్న శ్రీనివాస్ ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. చేపల చెరువుల వద్ద పని చేస్తున్న దుర్గాప్రసాద్‌కు బుధవారం ఫిట్స్‌తో చెరువులో పడిపోయాడు. అతను ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో అతని ఆచూకీ కోసం కుటుంబ సభ్యులు గాలించగా చెరువులో మృతదేహం లభ్యమైంది. కొన్ని నెలల నుంచి దుర్గాప్రసాద్ ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. చెరువులో పడిపోవడాన్ని ఎవరూ గమనించకపోవడంతో అతను మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారని తెలిపారు.

లారీ ఢీకొని మరొకరు..


మణికంఠ మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై సత్యనారాయణ

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లోని మట్లపాలెం రాఘవేంద్రపురం వద్ద గురువారం తెల్లవారు జామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ కథనం ప్రకారం.. కాజులూరు మండలం జగన్నాథగిరి కొత్తకాలనీకి చెందిన మణికంఠ (31) ద్విచక్ర వాహనంపై మట్లపాలెం వచ్చి తిరిగి వెళ్తుండగా యానాం వైపు నుంచి కాకినాడ వెళుతున్న లారీ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో మణికంఠ తలకు బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్సై సత్యనారాయణ సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. లారీ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నామని, ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై తెలిపారు.

వృద్ధుడి దుర్మరణం


ప్రమాదంలో మృతి చెందిన గుర్తు తెలియని వృద్ధుడు

తాళ్లరేవు: జాతీయ రహదారి 216లో పటవల వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. స్థానిక రామన్నపాలెం జంక్షన్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొని వృద్ధుడు (60) మృతి చెందినట్లు కోరంగి ఏఎస్సై శ్రీనివాస్ తెలిపారు. మృతుని వివరాలు తెలిసిన వారు కోరంగి పోలీస్ స్టేషన్‌లో గాని, 0884–2303533 నంబర్‌కు గాని ఫోన్ చేయాలన్నారు.

పేదింట పేలుడు

- అచ్యుతాపురంలో రియాక్టర్ పేలుడు ఘటనతో విషాదం
- ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురి మృతి
- కుటుంబానికో హృదయ విదారక గాథ

కల చెదిరింది.. కన్న హృదయం తల్లడిల్లింది.. పేదింట విషాదం నింపింది.. కుటుంబ బాధ్యతలను నెత్తినేసుకుని ఊరుకాని ఊరు వెళ్లి అనుకోని ఉత్పాతంలో చిక్కుకుని విగత జీవులైన వారిని చూసిన ప్రతి మది చలించిపోయింది.. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనలో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో నలుగురు మృతి చెందడం కలకలం రేపింది. ఆయా గ్రామాల్లో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాల్లో పెల్లుబికిన ఉద్వేగం ఇలా..

రెక్కలు విరిగి.. బాధ దిగమింగి


విలపిస్తున్న సతీష్ కుటుంబ సభ్యులు


సతీష్ (ఫైల్)

మామిడికుదురు: రెక్కలు ముక్కలు చేసుకుని ఎంతో కష్టపడి చదివించాం.. అందరిలో పైచేయి కావాలని అనుకున్నాం.. తమ ఆశలను నెరవేరుస్తూ కొడుకు ప్రయోజకుడు అయ్యాడని అనుకున్న క్షణాలు ఇంతలోనే ఆవిరవుతాయని అనుకోలేదని ఆ తల్లిదండ్రులు మనోవేదనకు గురవుతున్నారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా కంపెనీలో రియాక్టర్ పేలుడు ఘటనలో పాశర్లపూడిలంకకు చెందిన మారిశెట్టి సతీష్ (31) మృత్యువాత పడడం స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఎసెన్షియా కంపెనీలో ప్రొడక్షన్ విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా సతీష్ పని చేస్తున్నారు. నిరుపేద కుటుంబానికి చెందిన అతని దుర్మరణంతో భార్య సాయిశ్రీనాయకి దుర్గారామ వెంకటనాగమణి, తల్లి పద్మావతి, తండ్రి శ్రీనివాసరావు గురువారం విశాఖపట్నం ఆసుపత్రి వద్ద గుండెలవిసేలా రోదించారు. పేదరికంలో ఉన్నా తాము ఎంతో కష్టపడి కొడుకును చదివించామని, ఐదేళ్ల క్రితం ఉద్యోగం వచ్చిందన్న ఆనందం అంతలోనే ఆవిరైందని తల్లి నాగమణి, తండ్రి శ్రీనివాసరావు విలపించారు. తాను ఎవరి కోసం బతకాలని సతీష్ భార్య నాగమణి కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలో అందరితో ఆప్యాయంగా మాట్లాడే వాడని, గత నెలలో జరిగిన గ్రామ దేవత చింతాలమ్మ జాతరకు వచ్చి వెళ్లాడని, ఇంతలోనే విగతజీవిలా మారతాడని గ్రామస్తులు ఆవేదన చెందారు.

కలత మిగిలింది..


కొప్పర్తి గణేష్ కుమార్ (ఫైల్)

బిక్కవోలు: రియాక్టర్ పేలుడు ఘటనలో బిక్కవోలుకు చెందిన కొప్పర్తి గణేష్ కుమార్ (30) ఉన్నాడనే విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అతని మృతితో గ్రామంలో విషాదచాయలు అలముకున్నాయి. ఈ విషయం తెలుసుకున్న వెంటనే ఇక్కడి నుంచి అతని తల్లి దుర్గాభవాని, చెల్లి కల్యాణి విశాఖపట్నం బయలుదేరి వెళ్లారు. గణేష్ తండ్రి సత్యనారాయణ టైలర్‌గా బిక్కవోలులో చేస్తూ పదేళ్ల కిందట మృతి చెందారు. గణేష్‌కు ఐదేళ్ల కిందట అరుణకుమారితో వివాహం జరిగింది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. కొన్ని కారణాలతో భార్య, కుమారుడు రాజమహేంద్రవరంలో ఉంటున్నారు. ఆర్గానిక్ కెమిస్ట్రీ చదివిన అతను ఫైసంస్థలో 2021 అక్టోబర్‌లో చేరారు. ప్రొడక్షన్ విభాగంలో సీనియర్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్నారు. కుటుంబానికి జీవనాధారమైన గణేష్ మృతితో తల్లి దుర్గాభవాని, చెల్లి కల్యాణి విలపిస్తున్నారు. అతని మృతదేహాన్ని రాత్రి ఇక్కడకు తీసుకువచ్చారు.


హారిక మృతదేహం వద్ద రోదిస్తున్న బంధువులు. (అంతరచిత్రం) హారిక (ఫైల్)

తల్లడిల్లిన హృదయం

కాకినాడ రూరల్: తండ్రి లేడు.. అన్నయ్య ఎక్కడి వెళ్లాడో తెలియదు.. నాన్నమ్మ, అమ్మలకు ఆసరాగా ఉంటున్న ఆమె మృతితో ఆ వృద్ధులకు అండ లేకుండా పోయింది. ఎన్నో ఆశలతో ఉద్యోగంలోకి అడుగుపెట్టిన చదువుల తల్లి చర్లపల్లి హారిక జీవితం అర్ధాంతరంగా ముగిసిపోయింది. మెరిట్‌తో ఇడుపులపాయ ట్రిపుల్ ఐటీలో ఉన్నత విద్యనభ్యసించి కెమికల్ ఇంజినీర్‌గా జీవనం ప్రారంభించిన ఆ యువ ఇంజినీర్‌ను ట్రైనీ దశలోనే రియాక్టర్ రూపంలో ప్రమాదం కబళించింది. కాకినాడ 2వ డివిజన్ సౌజన్యనగర్‌కు చెందిన చర్లపల్లి హారిక (22) మృతి ఇక్కడి వారిని కలచివేసింది. ఆమె మృతదేహాన్ని గురువారం ఉదయం కాకినాడలో నివాసానికి తీసుకువచ్చారు. హారికను కడచూపు చూసేందుకు వచ్చి జనంతో ఆ ప్రాంతం దుఃఖం సాగరంలో మునిగిపోయింది. ఆమె తండ్రి ఐదేళ్ల క్రితం కోవిడ్‌తో చనిపోవడం, సోదరుడు చిన్నప్పుడే కనిపించకుండా పోవడంతో తల్లి అన్నపూర్ణ, నాన్నమ్మ ఆదిలక్ష్మిలు హారికను కంటికి రెప్పలా చూసుకుంటూ ఉన్నత చదువులు చదివించారు. ఉద్యోగం రావడంతో తమకు భరోసా ఉంటుందని కలలు కన్నారు. చిట్టి తల్లి లేవమ్మా అంటూ హారిక మృతదేహం వద్ద తల్లి విలపించిన తీరు అక్కడి వారిని కంటతడి పెట్టించింది.

సెలవు పెట్టి ఉంటే..

గత ఏడాది సెప్టెంబర్ నుంచి ఆ ఫార్మా కంపెనీలోని ల్యాబ్‌లో ట్రైనీ ఇంజినీర్‌గా హారిక పనిచేస్తున్నారు. ప్రమాదం జరిగే కొద్ది గంటల ముందే ఆమె ఇంటి నుంచి విధులకు వెళ్లింది. పరీక్షలు రాసేందుకు వచ్చిన ఆమె సోమవారం రాఖీ పండగ రోజున తమ పెద్దమ్మ కుమారులకు, ఇరుగు పొరుగు వారికి రాఖీ కట్టి వారి ఆశీస్సులు తీసుకుంది. బుధవారం ఉదయమే డ్యూటీ కోసం ఇంటి నుంచి వెళ్లింది. రెండు రోజుల తరువాత వెళ్లమని చెప్పానని, విని ఉంటే బతికేదేమోనని నాన్నమ్మ ఆదిలక్ష్మి రోదించింది. రియాక్టర్ ప్రమాదంలో 18 మంది మృతుల్లో హారిక ఒకరే మహిళ. పేలుడుకు తూలి పడడంతో తలకు గాయమై మృతి చెందినట్లు భావిస్తున్నారు. మిగిలిన వారి మృతదేహాలు గుర్తు పెట్టలేనంతగా మారాయి.

పదోన్నతి వచ్చిన కొద్ది రోజులకే..


భార్య, కుమార్తెతో మొండి నాగబాబు (ఫైల్)

సామర్లకోట: సామర్లకోట గాంధీనగర్‌కు చెందిన మొండి నాగబాబు (36) అనకాపల్లి జిల్లా అచ్చుతాపురం ప్రమాదంలో మృతి చెందాడు. బుధవారం మధ్యాహ్నం ఘటన జరిగినా అర్ధరాత్రి వరకూ కుటుంబ సభ్యులకు సమాచారం చేరలేదు. ఒంటి గంట ప్రాంతంలో విషయం తెలియడంతో నాగబాబు అన్నయ్యలు శ్రీను, దుర్గ ఇక్కడి నుంచి సంఘటనా ప్రదేశానికి బయలుదేరారు. ఐదేళ్ల కింట విశాఖపట్నంలోనే నాగబాబు స్థిర నివాసం ఏర్పాటు చేసుకున్నారు. మృతుని భార్య సాయిదుర్గ, తొమ్మిదేళ్ల కుమార్తె సాన్విత, ఆరేళ్ల కుమారుడు మాన్విత్‌తో కలసి అక్కడే ఉంటున్నారు. ఇటీవల ఆ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్‌గా నాగబాబుకు పదోన్నతి లభించింది. వారం రోజుల కిందట సామర్లకోట వచ్చిన ఆయన పదోన్నతి విషయం


కుమారుని మరణ వార్త తెలిసి రోదిస్తున్న తల్లి లక్ష్మి

చెప్పి తల్లి, అన్నయ్యల వద్ద ఆనందాన్ని పంచుకున్నాడు. ఆ సంతోషం ఎంతో కాలం నిలవకుండానే ఈ దుర్ఘటన తెలియడంతో తల్లి లక్ష్మి విలపించింది. నాన్న ఎక్కడని పిల్లలు అడిగితే ఏం సమాధానం చెప్పాలని ఆమె కన్నీరు మున్నీరైంది. ఆరు నెలల క్రితమే నాగబాబు తండ్రి మృతి చెందిన బాధను మరిచిపోక ముందే ఈ ఘటన జరగడం బాధిత కుటుంబాన్ని కలచివేస్తోంది. మృతుల కుటుంబాలకు రావాల్సిన నష్ట పరిహారంపై ప్రభుత్వం నుంచి స్పష్టమైన హామీ రాకపోవడంతో మృతదేహాన్ని అక్కడి ఫ్యాక్టరీ వద్ద ఉంచి ధర్నా చేశారు. చివరకు రాత్రి సమయానికి నాగబాబు మృతదేహాన్ని సామర్లకోట తీసుకువచ్చారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి


మృతి చెందిన గుర్తు తెలియని వ్యక్తి

తుని: తుని– హంసవరం మధ్యలో రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (35) మృతి చెందాడని స్థానిక జీఆర్పీ ఎస్సై జి.శ్రీనివాసరావు తెలిపారు. తాళ్లూరు రైల్వే గేటు సమీపంలో రైలు ఢీకొనడంతో ఆ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి ఒంటిపై నీలం టీషర్ట్, స్కై బ్లూ రంగు జీన్ ఫ్యాంటు ఉన్నాయి. ఎడమ చేతిపై అజయ్ అనే పచ్చ బొట్టు ఇంగ్లిష్‌లో ఉంది. మృతుడి వివరాలు తెలియరాలేదని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.

అథ్లెటిక్స్ ఎంపికలు వాయిదా

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): జిల్లా అథ్లెటిక్స్ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 23వ తేదీ శుక్రవారం కాకినాడ డీఎస్ఏ మైదానంలో జరగాల్సిన క్రీడాకారుల ఎంపికలు వర్షం కారణంగా వాయిదా పడినట్లు సంఘ కార్యదర్శి సుబ్రహ్మణ్యం గురువారం తెలిపారు. తర్వాత ఎంపికలు ఎప్పుడు జరుగుతాయో తెలియజేస్తామన్నారు. ఈ మార్పును క్రీడాకారులు గమనించాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఈ నెల 29న జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా నుంచి అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో రాణించిన క్రీడాకారులను సత్కరించడానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్ కుమార్ గురువారం తెలిపారు. అసోసియేషన్స్, ఖేలో ఇండియా, యూనివర్సిటీ, స్కూల్‌గేమ్స్‌లో రాణించిన క్రీడాకారులు అర్హులన్నారు. 26వ తేదీ మధ్యాహ్నం 12 గంటల్లోపు దరఖాస్తులను డీఎస్ఏ కార్యాలయంలో ఇవ్వాలన్నారు. వివరాలకు 89196 42248 ఫోన్ నంబర్‌లో సంప్రదించాలన్నారు.

వచ్చే నెల 14న జాతీయ లోక్ అదాలత్

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జాతీయ న్యాయ సేవాధికార సంస్థ ఆదేశానుసారం ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో సెప్టెంబర్ 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత తెలిపారు. గురువారం స్థానికంగా విలేకరుల సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడుతూ రాజమహేంద్రవరం, అమలాపురం, కాకినాడ, పెద్దాపురం, పిఠాపురం, రామచంద్రపురం, రాజోలు, ఆలమూరు, తుని, ముమ్మిడివరం, కొత్తపేట, ప్రత్తిపాడు, అనపర్తి, రంపచోడవరం, అడ్డతీగలలోని కోర్టుల్లో ఈ లోక్ అదాలత్ నిర్వహిస్తారన్నారు. పెండింగ్‌లో ఉన్న సివిల్ తగాదాలు, యాక్సిడెంట్, బ్యాంకు, రాజీపడ్డదగ్గ క్రిమినల్ కేసులు, ప్రీ–లిటిగేషన్ కేసులు పరిష్కరించాలని సూచించారు. జ్యుడీషియల్ నాలుగు డివిజన్ల పరిధిలో 79,750 కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, ఇందులో రాజీ చేసుకోదగిన కేసులు 39 వేల వరకూ ఉన్నాయన్నారు. రాజీ చేసుకున్న వారికి కోర్టు ఫీజు కూడా వెనక్కి ఇస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు ఉపయోగించుకోవాలని తెలిపారు.

తల్లి మందలించిందని విద్యార్థిని ఆత్మహత్య


కాకినాడ జీజీహెచ్‌లో మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై రామకృష్ణ

కరప: సరిగా చదవడం లేదని తల్లి మందలించిందన్న మనస్థాపంతో ఓ విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కరప మండలం నడకుదురులో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం... నడకుదురు గ్రామానికి చెందిన పడాల ఆదిలక్ష్మి కుమార్తె సుష్మ శ్రీదేవి (19) కోరంగిలోని బాలికల పాలిటెక్నిక్ కళాశాలలో ఫార్మా–డీ చదువుతోంది. ఆమె సరిగా చదవడం లేదని తల్లి మందలించింది. మనస్థాపానికి గురైన సుష్మ తల్లిని బెదిరించాలన్న ఉద్దేశంతో ఈ నెల 20న ఉదయం గడ్డి మందు తాగింది. వెంటనే ఆమెను కాకినాడలోని సూపర్ స్పెషాలిటీ హాస్పటల్‌కు తీసుకెళ్లి చికిత్స చేయించారు. తర్వాత మరో ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ టి.రామకృష్ణ కేసు నమోదు చేసి, కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేయించారు.

25న చదరంగం పోటీలు

రాజమహేంద్రవరం సిటీ: తూర్పుగోదావరి చదరంగం సంఘం ఆధ్వర్యంలో ఎమ్‌కే చెస్ అకాడమీ సారథ్యంలో ఈ నెల 25న రాజమహేంద్రవరంలో అండర్–15 జిల్లా స్థాయి బాలురు, బాలికల చదరంగం పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ విషయాన్ని జిల్లా చదరంగం సంఘ కార్యదర్శి జీవీ కుమార్ గురువారం తెలిపారు. స్థానిక మెయిన్ రోడ్‌లోని రత్నా ప్యాలెస్ సమీపంలో ది రాజమండ్రి ఐరన్ హార్డ్‌వేర్ పెయింట్స్ మర్చంట్స్ అసోసియేషన్‌లో నిర్వహించే ఈ పోటీల్లో విజేతల్లో ఇద్దరు బాలురు, బాలికలు చొప్పున జిల్లా తరఫున అండర్–15 రాష్ట్ర పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. క్రీడాకారులు 2009 జనవరి 1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. అభ్యర్థులు తమ పేర్లను ఈ నెల 24వ తేదీలోగా నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 98853 02468 ఫోన్ నంబరులో సంప్రదించాలన్నారు.

విజ్ఞాన సారాంశం చాటేలా..

- మండపేటలో అంతర్జాతీయ సదస్సు
- హాజరైన స్వదేశీ, విదేశీ శాస్త్రవేత్తలు
- స్మార్ట్ మెటీరియల్స్ అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్‌పై చర్చ



సదస్సులో ప్రసంగిస్తున్న డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా

కపిలేశ్వరపురం: విజ్ఞాన సారాంశాన్ని చాటారు.. కొత్త అంశాలు ఎలా కనుగొనాలో విశదీకరించారు.. వస్తున్న మార్పులను ఆకళింపు చేసుకునేలా మండపేటలో అంతర్జాతీయ స్థాయి శాస్త్రవేత్తల మేథోమథనం సాగింది. ఇక్కడి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాసరావు పర్యవేక్షణలో ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల అధ్యాపకుల ఆధ్వర్యంలో గురువారం రెండు రోజుల జాతీయ సదస్సును ప్రారంభించారు. దక్షిణ కొరియా, న్యూయార్క్, ఢిల్లీ తదితర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు హాజరై తమ పరిశోధనల సారాంశాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. స్మార్ట్ మెటీరియల్స్, అండ్ అడ్వాన్స్‌డ్ అప్లికేషన్స్– 2024 పేరుతో నిర్వహించిన సదస్సును ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు ప్రారంభించారు. సైన్స్‌లోని పలు విభాగాల్లో కొత్తగా వృద్ధి చెందిన మెటీరియల్‌ను విద్యార్థులు, అధ్యాపకులకు తెలియజేసే లక్ష్యంతో ఈ సదస్సును నిర్వహిస్తున్నారు. సైద్ధాంతిక భౌతిక శాస్త్రం ద్వారా కణాలు, వాటి పరిమాణాలు, పరివర్తనలు, ప్రాధాన్యాన్ని బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్‌కు చెందిన డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫిజిక్స్ డాక్టర్ వేమపాటి సుధీర్‌కుమార్ వివరించారు. నకిలీ నోట్లను గుర్తించడంలో శాస్త్రీయ పద్ధతులపై ఢిల్లీలోని నేషనల్ లేబొరేటరీ ప్రిన్సిపల్ సైంటిస్ట్ డాక్టర్ బిపిన్ కుమార్ గుప్తా ప్రసంగించారు. నకిలీ నోట్ల వ్యవహారాల్ని, వాటి నిర్వహణలో వృద్ధి చేసిన స్మార్ట్ మెటీరియల్స్‌లో నానో పౌడర్స్, క్వాంటం మెటీరియల్స్ ద్వారా ఎలా తెలుసుకోవాలో వివరించారు. తిరుచనాపల్లిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన ఫిజిక్స్ విభాగం ప్రొఫెసర్ డాక్టర్ జె.హేమలత మాట్లాడుతూ ఆధునిక కాలంలో స్మార్ట్ మెటీరియల్ ప్రాధాన్యాన్ని తెలియజేశారు. తమ పరిశోధనలో కనుగొన్న నూతన పద్ధతులను వివరించారు. దేశంలోని పలు ప్రాంతాల నుంచి 75 మంది తమ పరిశోధనా పత్రాలను నిర్వాహకులకు పంపించగా, వాటిలో 60 పత్రాలను ఎంపిక చేశారు. వాటితో ప్రచురితమైన సావనీర్‌ను ఎమ్మెల్యే, ప్రిన్సిపాల్, శాస్త్రవేత్తల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

పరిశోధనలతో భవిష్యత్తు



విజ్ఞానానికి స్థిరత్వ ప్రామాణికాలు ఉండవు. ప్రకృతిలో జరుగుతున్న మార్పులతో పాటు విజ్ఞానం సైతం మారుతుంది. ప్రకృతి నియమాలను అర్థం చేసుకుంటూ మార్పును పరిశీలిస్తూ వ్యక్తిగత పరిశోధనతో నూతన మార్గాలను అన్వేషించడానికి మానవుడు అలవాటు పడాలి. అదే భవిష్యత్‌కు మార్గదర్శకం అవుతుంది. ఆ కృషి మండపేటలో జరగడం అభినందనీయం.

–డాక్టర్ కె.నవీన్‌కుమార్, ప్రొఫెసర్, దక్షిణ కొరియా

సమష్టి కృషి ఫలితం



1989లో కళాశాలను స్థాపించారు. నేడు జరుగుతున్న అంతర్జాతీయ సదస్సు కళాశాల చరిత్రలో తొలిసారి. ఆ సదస్సును నిర్వహించే బాధ్యతలను చేపట్టడం ఆనందాన్ని కలిగిస్తుంది. యూనివర్సిటీ, ప్రభుత్వ ఉన్నతాధికారుల అనుమతి ఇవ్వడంతో ఈ సదస్సుకు అంకురార్పణ జరిగింది. ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల అధిపతులు కె.శ్రీనివాసరావు, బోడా శ్రీకాంత్, కొండపల్లి బాబూరావు, ఎస్.రామకృష్ణ, అధ్యాపక సిబ్బంది, ఇతర కళాశాల అధ్యాపక, విద్యార్థుల సమష్టి కృషి ఫలితమే ఇది.

–డాక్టర్ టీకేవీ శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మండపేట

భావి శాస్త్రవేత్తలకు మార్గదర్శకం



అంతర్జాతీయ సదస్సు నేపథ్యంలో దేశం నలుమూలల నుంచి 75 మంది తమ పరిశోధనా పత్రాలను పంపారు. వాటిని చదివి అర్థం చేసుకుని ప్రాధాన్యం ఉన్న 60 పత్రాలను ఎంపిక చేశాం. అంతర్జాతీయ సదస్సు ప్రాధాన్యాన్ని తెలియజేసేలా సావనీర్‌లో వాటిని ప్రచురించాం. భావిభారత శాస్త్రవేత్తలకు అది మార్గదర్శకం కానుంది.

–కె.శ్రీనివాసరావు, కన్వీనర్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హెడ్ ఫిజిక్స్, ప్రభుత్వ కళాశాల, మండపేట

ఆధునిక విజ్ఞానంపై అవగాహన



యూఎస్ఏ, సౌంత్ కొరియా వంటి దేశాల్లో నిర్వహించే సదస్సును మండపేటలో నిర్వహించడం ఆనందంగా ఉంది. ప్రపంచ స్థాయి శాస్త్రవేత్తల హాజరుతో మాలాంటి విద్యార్థులకు ఉత్తేజాన్ని కలిగిస్తుంది. కళాశాలలో అధ్యాపకులు చెప్పిన అంశాలను ప్రాపంచిక దృక్పథంతో చూసే వీలు సదస్సు ద్వారా కలిగింది. అంతర్జాయంగా జరుగుతున్న శాస్త్ర విజ్ఞాన మార్పులు తెలుసుకునే అవకాశాన్ని కల్పించిన నిర్వాహకులకు కృతజ్ఞతలు.

–ఎస్.రమ్య, బీఎస్సీ విద్యార్థిని, పీఆర్ కళాశాల, కాకినాడ